

అగ్ని ప్రమాదాలతో జాగ్రత్త
అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. 8లో



గంజాయి ముఠా అరెస్ట్
ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఖమ్మం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 8లో



వాతావరణం
జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం


చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శనివారం చండీహోమం పూజలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని యాగశాలలో చండీ హోమం జరిపారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజలు చేసి చండీహోమం నిర్వహించారు. చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోమం పూజలో పాల్గొన్న 25 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యే ఆట విడుపు


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ : అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆట విడుపుగా కొద్దిసేపు క్రికెట్ ఆడి యువకులను ఉత్సాహ పరిచారు. శనివారం ఉదయం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే చంద్రుగొండ నుంచి పోకలగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామశివారులో యువకులు క్రికెట్ ఆడుతుండగా, వారితో కలిసి సరదాగా బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. గ్రౌండ్ ఏర్పాటు చేయాలని యువకులు కోరగా.. అందుకోసం ప్రభుత్వ స్థలం చూడాలని అక్కడే ఉన్న తహసీల్దార్ సంధ్యారాణికి సూచించారు.

వనం వీడిన జీవి

దరిపల్లి రామయ్య అంటే జిల్లాలో ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. కానీ వనజీవి రామయ్య అంటే మాత్రం మెడలో వృక్షో రక్షతి రక్షితః అనే ఆకుపచ్చని బోర్డుతో ఉండే ఆయన రూపం వెంటనే గుర్తుకొస్తుంది. కరుణగిరి నుంచి మారెమ్మ గుడి మార్గంలో వెళ్లేవారు ఎప్పుడో ఒకసారి రోడ్డుపక్కన చెట్ల కింద గింజలు సేకరిస్తూ.. మొక్కలకు పాదులు చేసి రక్షణ కల్పిస్తూ ఉండే ఆయనను చూసి ఉంటారు. ఐదో తరగతి వరకే చదువుతున్న ఆయనకు మొక్కల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై ఉపాధ్యాయుడు చెప్పిన మాట మనసులో బలంగా నాటుకుపోయింది. దీంతో మొక్కలు నాటడం, సంరక్షణే ధ్యేయంగా రామయ్య చివరివరకు పాటుపడ్డారు. అడవి తన పరిధిలో చెట్లను తానే పెంచుకుంటుంది.. జనం మధ్యలో మాత్రం మనమే పెంచాలి.. అని చెప్పే రామయ్య గుండెపోటుతో 88 ఏళ్ల వయస్సులో మృతి చెందగా, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కాగా, అంత్యక్రియలు పల్లెగూడెం శ్మశానవాటికలో ఆదివారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన జరగనున్నాయి.

– ఖమ్మంరూరల్



88 ఏళ్ల వయస్సులోనూ..
88 ఏళ్ల వయస్సులోనూ అవిశ్రాంతంగా రామయ్య ప్రతీరోజు మొక్కలు నాటేవారు. గుండెకు స్టంట్ వేసినా.. రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగినా ఇంటి ఆవరణ, సమీపంలో మొక్క నాటారే తప్ప తన యజ్ఞాన్ని ఆపలేదు. ఉమ్మడి ఏపీలో రామయ్యకు ద్విచక్ర వాహనాన్ని సమకూర్చగా, హరిత నిధి ద్వారా నెలనెలా రూ.50వేలు ఇస్తున్నారు.



- జీవితం మొత్తం పర్యావరణ పరిరక్షణ కోసం తపించిన పర్యావరణ ప్రేమికుడు వనజీవి రామయ్య కోల్పోవడం చాలా బాధాకరమని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ ఐ.హరినాథ్‌బాబు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

- ఇంటి పేరునే వనజీవిగా మార్చుకున్న దరిపల్లి రామయ్య మృతి దేశానికే తీరని లోటని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రామయ్య మృతదేహం వద్ద నివాళులర్పించాక ఆయన మాట్లాడుతూ కోటికి పైగా మొక్కలు నాటిన రామయ్య జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు చాటారని కొనియాడారు. రామయ్యతో తనకు 1994 నుంచి పరిచయం ఉందని గుర్తు చేసుకున్నారు.

శిక్ష వద్దు.. మొక్కలు నాటించండి..
ప్రమాదంలో తాను గాయపడడానికి కారణమైన వ్యక్తికి శిక్ష కాకుండా మొక్కలు నాటించాలని చెప్పిన ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య. 2022లో ఆయన స్వగ్రామమైన రెడ్డిపల్లిలో మొక్కలకు నీరు పోసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు స్పందించగా.. డ్రైవర్‌పై కేసు కాకుండా, 100 మొక్కలు నాటించాలని రామయ్య అభ్యర్థించారు.


సీఎం రేవంత్ రెడ్డితో వనజీవి దంపతులు(ఫైల్)


నివాళులర్పిస్తున్న ఖమ్మం ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ

పద్మశ్రీ రామయ్య కన్నుమూత
- నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందిన 'దరిపల్లి'
- కోటిన్నరకుపైగా మొక్కలు నాటిన మహారుషి
- ప్రధాని, సీఎం సహా నివాళులర్పించిన ప్రముఖులు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

మొక్కలే ప్రాణం.. అభిమానం

పాఠశాల సమయాన ఉపాధ్యాయుడు జి.మల్లేశం మొక్కల పెంపకంతో లాభాలను వివరించడం రామయ్య మనస్సులో నాటుకుపోయింది. దీనికి 'సొంత లాభం కొంత మానుకుని పరుల కోసం సాయపడవోయ్' అన్న అనే గురజాడ సూక్తిని అందిపుచ్చుకున్న ఆయన తన ఇంటి నుండే మొక్కలు నాటడం ప్రారంభించారు. ఇంట్లో సగభాగానికి పైగా మొక్కలు నాటగా అవి వృక్షాలయ్యాయి. అంతటితో ఆగక నీడ, ఫలాలను ఇచ్చే మొక్కల విత్తనాలు సేకరించడం.. వర్షాకాలం ప్రారంభంలో రోడ్లు, కార్యాలయాలు, స్కూళ్లు, ఆలయాల వెంట నాటడం అలవాటైంది. అంతేకాక తాను నాటిన గింజలు మొక్క రూపం నుంచి మానుగా మారే వరకు నిత్యం పర్యవేక్షించేవారు. ఆయన జీవితాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో, తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘిక శాస్త్రంలో చేర్చడం రామయ్య కృషికి దక్కిన ఫలితమని చెప్పొచ్చు.

కుటుంబ సభ్యులకు చెట్ల పేర్లు

వనజీవి రామయ్య తన కుటుంబ సభ్యులకు చెట్ల పేర్లు పెట్టి మొక్కలపై మక్కువను చాటారు. మనవరాళ్లకు హరిత లావణ్య, చందన పుష్ప, కబంధ పుష్ప, వనశ్రీ పేర్లు పెట్టగా... తన సంతానం వివాహ సమయాన శుభలేఖలపై మొక్కల సమాచారం, ప్రాధాన్యతను ముద్రించారు. అంతేకాక కుటుంబీకుల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే చెట్ల పసరుతో వైద్యం చేసే రామయ్య... 120రకాల మొక్కల చరిత్రను క్షుణ్ణంగా చెప్పేవారు.

కోటిన్నరకు పైగా మొక్కలు..

తన జీవిత కాలంలో రామయ్య కోటిన్నరకు పైగా మొక్కలు నాటినట్లు అంచనా. భవిష్యత్ తరాల మనుగడకు మొక్కలే ఆధారమని నమ్మే ఆయన ఊరూరా ప్రచారం చేసేవారు. ఏ కార్యానికి వెళ్లినా మొక్కలనే బహుమతిగా ఇచ్చేవారు. అయితే, తాను కన్నుమూసేలోగా 3కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యంగా చెప్పే రామయ్య మధ్యలో కన్నుమూశారు. కాగా, ప్రభుత్వం తనకు 20ఎకరాల భూమి కేటాయిస్తే అందులో మొక్కలు పెంచి వాటి ప్రత్యేకతలు, పెంపకం ఆవశ్యతను ప్రజలకు అవగాహన కల్పిస్తానని అధికారులను కోరేవారు. అంతేకాక ఆ చెట్ల గింజలతో మొక్కలుపెంచి ప్రజలకు ఉచితంగా ఇస్తానని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.

అటవీశాఖ ఉద్యోగులకు పాఠాలు

మొక్కల పెంపకమే కాదు అటవీశాఖ ఉద్యోగులకు పాఠాలు చెప్పేవారు. శిక్షణ పూర్తి చేసుకున్న అటవీశాఖ ఉద్యోగులు రామయ్యను కలవడం ఆనవాయితీ కాగా.. ఆయన తన అనుభవాలను వివరించేవారు. కాగా, తన ఇంట్లో రామయ్య నాటిన ఎర్రచందనం చెట్ల ద్వారా దాదాపు 20టన్నుల ఎర్రచందనం వచ్చింది. ఇక కరెన్సీ నోట్లపై మొక్కలు నాటే చిత్రాన్ని ప్రచురించాలని, తద్వారా అందరికీ ప్రాధాన్యత తెలుస్తుందని రామయ్య కేంద్ర ప్రభుత్వానికి ఓసారి విన్నవించారు.

పద్మశ్రీ సహా అవార్డులెన్నో..

రామయ్య ప్రకృతిపై పెంచుకున్న ప్రేమతో అవార్డులే వెతుక్కుంటూ వచ్చాయి. కోటి మొక్కలు నాటిన సందర్భంగా ఆయన ట్రీమ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందారు. 1995లో కేంద్ర ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు అందుకున్నారు. 2005లో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ ఢిల్లీలో వనమిత్ర అవార్డును అప్పటి ప్రధాని చేతుల మీదుగా అందజేసింది. గతంలో ఖమ్మం కలెక్టర్లుగా పనిచేసిన వారి చేతుల మీదుగా పలు అవార్డులు స్వీకరించారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఆయన కృషిని గుర్తించి పద్మశ్రీ ప్రకటించగా ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. ఇన్ని అవార్డులు సొంతమైనా మొక్కలు పంపిణీ, నాటడం ఆపకపోగా.. రామయ్య ఆశయ సాధనలో భార్య జానకమ్మ చేదోడుగా నిలిచారు.

పాట పాడుతూ నిద్రలోకి...
ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన దరిపల్లి లాలయ్య – పుల్లమ్మ దంపతులకు 1937 జూలై 1న రామయ్య జన్మించారు. ఆయన కుటుంబానికి రెడ్డిపల్లి వద్ద పొలాలు ఉండడంతో ఇక్కడకు వచ్చి నివాసం ఏర్పర్చుకున్నాడు. ఆతర్వాత తల్లాడకు చెందిన జానకమ్మతో ఆయనకు వివాహమైంది. శాలివాహన కులానికి చెందిన రామ య్య కుండలు చేస్తూనే ప్రవృత్తిరీత్యా మొక్కలు పెంచడం అలవాటుగా మార్చుకున్నారు. వీరికి ముగ్గురు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కుమార్తె సైదమ్మ సంతానం కాగా కుమారులు సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం రాత్రి వనాలు, చెట్ల ప్రాధాన్యతను వివరించే పాట పాడుతూ రామయ్య నిద్రలోకి జారుకున్నారు. అయితే, రోజూ ఉదయాన్నే 4గంటలకే లేచే ఆయన 6గంటలైనా మేల్కొనకపోవడంతో భార్య తట్టినా ఫలితం కానరాలేదు. దీంతో కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సరికి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

బ్రహ్మోత్సవాలు 'పరిపూర్ణం'

భద్రాచలం వద్ద గోదావరిలో వైభవంగా చక్రస్నానం


గోదావరిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో గత నెల 30న ప్రారంభమైన వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన శనివారం స్వామివారి సుదర్శన చక్రానికి చక్రస్నానం కమనీయంగా జరిపారు. సుదర్శన చక్రాన్ని, ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పవిత్ర గోదావరి వద్దనున్న పునర్వసు మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం, హారతి సమర్పించారు. అనంతరం గోదావరిలో సుదర్శన చక్రానికి సంప్రదాయబద్ధంగా చక్రస్నానం జరిపారు. సాయంత్రం ధ్వజావరోహణం, దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు నిర్వహించారు. యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతిలతో బ్రహ్మోత్సవాలను పరిపూర్ణం చేశారు. సాయంత్రం శేష వాహనంపై స్వామివార్లను కొలువుదీర్చి తిరువీధి సేవ గావించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో భక్తుల రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రామాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. మూడు రోజుల సెలవులతోపాటు హనుమాన్ విజయోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలధారులు భద్రగిరికి తరలివచ్చారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకోగా, మాలధారులు మాల విరమణ గావించారు. నేటి నుంచి నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా బేడా మండపంలో నిలిపివేసిన నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. స్వామివారి నూతన పర్యంకోత్సవం ఈ నెల 22వ తేదీన జరపనున్నారు. పవళింపు సేవలు కూడా అదే రోజు నుంచి నిర్వహించనున్నారు. ఆదివారం చిత్తనక్షత్రం సందర్భంగా సుదర్శన హోమ పూజలను జరుపుతారు.


ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

నేడు ఆదివాసీ జేఏసీ సమావేశం
భద్రాచలంటౌన్: పట్టణంలో ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు జాతీయ ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్య దొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన అభ్యుదయ భవన్‌లో జరిగే ఈ సమావేశంలో ఎస్టీ వర్గీకరణపై చర్చ జరిపి కార్యాచరణ నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు.

సవాళ్లను స్వీకరించారు

- మైనింగ్ రంగంలో మహిళా ఇంజనీర్లు
- భూగర్భ గనుల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు
- సింగరేణిలో 38 మంది అధికారిణులు


సింగరేణి గనుల్లో విధులు నిర్వర్తి మహిళా ఇంజనీర్లు

పోలీస్ చేతిలో లాఠీలా ఈ మహిళల చేతిలో కనిపించే ఊత కర్రను బంటన్ స్టిక్ అంటారు. భూగర్భ గనుల్లోకి వెళ్లినప్పుడు ఈ కర్రతో పైకప్పును కొట్టడం ద్వారా ఆ ప్రదేశం పనికి అనుకూలంగా ఉంది లేనిది గుర్తిస్తారు. అయితే నిన్నామొన్నటి వరకు ఈ స్టిక్ పట్టుకునే హక్కు పురుషులదే. కఠినమైన పరిస్థితులు ఉండే భూగర్భ గనుల్లో ఈ పని చేయలేరంటూ ఈ అవకాశం మహిళలకు ఇవ్వలేదు. అదంతా కాలం చెల్లిన అభిప్రాయమని నిరూపిస్తున్నారు ఈ యంగ్ విమెన్ మైనర్స్.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

నో చాన్స్

దేశంలో బొగ్గు తవ్వకాలకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం పురుషులతో సమానంగా మహిళలకు గనుల్లో పని చేశారు. పని ప్రదేశాల్లో ఉండే కఠినమైన పరిస్థితులు, మహిళల భద్రత దృష్ట్యా స్వాతంత్ర్యం వచ్చాక గనుల్లో మహిళలకు ఉద్యోగాలు కల్పించడంపై చట్టపరంగా నిషేధించారు. ఆ ప్రభావం సింగరేణిపై కూడా పడింది. దీంతో 2000 ఆరంభం వచ్చే సరికి నర్సులు, డాక్టర్లు, క్లరికల్ పోస్టులు తప్పితే మిగిలిన చోట్ల మహిళలకు అవకాశమే లేకుండా పోయింది. 2017 తర్వాత కారుణ్య నియామకాల ద్వారా మరికొందరికి అవకాశం దక్కినా అవి కూడా ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకే పరిమితమయ్యాయి.

భిన్నమైన మార్గంలో

సింగరేణి బొగ్గు గనులను దృష్టిలో ఉంచుకుని 1970వ దశకంలో కొత్తగూడెంలో మైనింగ్ కాలేజీ ప్రారంభమైంది. దశాబ్దాల పాటు ఈ కాలేజీలో బాలికలకు ప్రవేశం ఇవ్వలేదు. 2013లో తొలిసారిగా ఇంజనీరింగ్ మైనింగ్ బ్రాంచిలో మహిళలకు ప్రవేశం కల్పించారు. తొలి బ్యాచ్‌లో ఐదుగురు, రెండో బ్యాచ్‌లో ఏడుగురు చేరారు. అలా చేరిన, ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కృష్ణవేణి అందరిలా కాకుండా సవాల్ విసిరుతూ మైనింగ్ రంగంలోకి వచ్చింది. బంధువులు, స్నేహితులు, లెక్చరర్లు, ప్రిన్సిపాల్ వరకు బ్రాంచి మార్చుకోవాలంటూ సూచించారు. కానీ ఐదుగురు బాలికలు స్థిరంగా నిలబడ్డారు. దీంతో మైనింగ్ కోర్సు మహిళలకు కూడా అనే భావనకు బలం వచ్చింది. ఆ మరుసటి ఏడాది బ్యాచ్‌లో కొత్తగూడెం పట్టణానికే చెందిన రమ్యశ్రీ చేరింది. చిన్నప్పటి నుంచి సింగరేణి వాతావరణంలో పెరగడంతో ఇందులోనే కెరీర్ ఎంచుకోవాలని నిర్ణయించింది. ఆ తర్వాత బ్యాచ్‌లో అనుపమ వచ్చి చేరింది. అలా మైనింగ్ కోర్సులో అడ్మిషన్లు తీసుకునే బాలికల సంఖ్య నిలకడగా ఉంటూ వస్తోంది. ఆ ఫలితంగానే కేఎస్ఎం, జేఎన్‌టీయూ (మంథని)తో పాటు మరో ఐదు ప్రైవేటు కాలేజీలు సైతం మైనింగ్ కోర్సును మహిళలకు ఆఫర్ చేస్తున్నాయి.

అడ్డంకులు దాటుకుని..

మహిళలు మైనింగ్ ఇంజనీరింగ్ చదవడమేంటనే మాటలు వింటూనే కోర్సు పూర్తి చేశారు. అప్పటికీ ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థల్లో మహిళా ఇంజనీర్లకు ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు. అయినా విమెన్ మైనింగ్ గ్రాడ్యుయేట్లు వెనక్కి తగ్గలేదు. ప్రైవేటు కంపెనీల్లో ఆఫర్లు వెతుక్కుంటూ పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాలకు వెళ్లారు. సాధారణంగా గనుల తవ్వకాలు జరిగే ప్రదేశాలు చాలా వరకు రిమోట్ ఏరియాలుగానే ఉంటాయి. రోడ్డు సౌకర్యం కూడా సరిగా ఉండదు. దుమ్ము ధూళి ఎక్కువ. ఎండా వానలు లెక్క చేయకుండా పని చేయాలి. దీనికి తోడు బయటి రాష్ట్రాల్లో ఉండే భాష, సంస్కృతి, ఆహారపు అలవాట్లు విభిన్నం. అయినా వారు వెరవలేదు. పురుషుల ఆధిపత్యం ఎక్కువగా ఉండే మైనింగ్ ఇండస్ట్రీలో సమర్థంగా పని చేశారు. మైనింగ్ ఫీల్డ్ ఒక్కటే కాదు ఆహారం, సంస్కృతి, కాలుష్యం ఏవీ తమ పట్టుదల ముందు దిగదుడుపే అని నిరూపించారు.

సగర్వంగా నిలిచారు

గనుల్లో మహిళలకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం తొలిసారిగా 2024లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా మహిళలకు సింగరేణి అవకాశం కల్పించింది. దీంతో ఒక్కసారే 38 మంది ఇంజనీర్లు గనుల్లో పని చేసే అవకాశం దక్కించుకున్నారు. వీరంతా సింగరేణిలోని వివిధ ఏరియాల్లో సమర్థంగా విధులు నిర్వహిస్తూ హమ్ కిసీ సే కమ్ నహీ అంటూ భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్నారు.

దృక్పథం మారాలి



ఒక అబ్బాయి ఏదైనా పని చేయడంలో విఫలమైతే కేవలం ఆ అబ్బాయి ఒక్కడే విఫలం అయ్యాడు అని అంటారు. అదే ఎవరైనా ఒక అమ్మాయి ఒక పని చేయడంలో తడబడితే చాలు, అమ్మాయిలంతా ఇంతే, ఏ పని చేయలేరంటూ ముద్ర వేస్తారు. ఈ ఆలోచన తీరులో మార్పు రావాలి.

– కృష్ణవేణి

మొదట్లో వినేవాళ్లు కాదు



మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా మా సూచనలు పాటించేందుకు కార్మికులు మొదట్లో సందేహించే వారు. మేము ఎంత విపులంగా చెప్పినా పురుష అధికారుల దగ్గరకు వెళ్లి కన్‌ఫర్మ్ చేసుకునే వాళ్లు. కానీ త్వరగానే మార్పు వచ్చింది. మహిళా అధికారులకు మద్దతు పెరిగింది.

– రమ్యశ్రీ

కేటీపీఎస్‌లో భారీగా బదిలీలు
పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో పలువురు అధికారులకు, ఉద్యోగులకు శనివారం బదిలీ ఉత్తర్వులు జారీఅయ్యాయి. జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా తన మార్క్ చూపించారనే చర్చ సాగుతోంది. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ మూత బడటంతో అక్కడ పనిచేస్తున్న 30 మంది ఇంజనీర్లను యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కేటీపీఎస్ 5,6 దశల నుంచి వి.వెంకటేశ్వరరావు, ఏడీఈ బి.జయ ప్రకాష్‌లను కూడా బదిలీపై యాదాద్రికి పంపారు. గతంలో కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం మూతబడటంతో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. వీరిలో అత్యధికంగా యాదాద్రికి బదిలీ అయ్యారు. అనంతరం పలువురు ఉద్యోగులు, కార్మి క సంఘాల నాయకులు ప్రజాప్రతినిధుల సిఫారుసులతో పైరవీలు చేసుకుని సొంత జిల్లాలోని కేటీపీఎస్‌కు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌కు, బీటీపీఎస్‌కు వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయా స్టేషన్లలో పనిచేస్తున్న 20 మంది ఫోర్‌మెన్‌లు, 39 మంది పీఏలు, 27 మంది జేపీఏలను తిరిగి యాదాద్రి స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇందులో వివిధ కార్మిక సంఘాల నాయకులు కూడా ఉన్నారు. కాగా కేటీపీఎస్ ఉద్యోగుల బదిలీలతో పాల్వంచ పట్టణం వెలవెలబోతోంది.

పలువురు ఎస్ఐల బదిలీ

ప్రక్షాళన దిశగా భద్రాచలం పోలీస్ స్టేషన్!

భద్రాచలంఅర్బన్: జిల్లావ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. భద్రాచలం పోలీస్ స్టేషన్‌కు ఇద్దరు కొత్త ఎస్‌ఐలను నియమించారు. ఇప్పటివరకు ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మిని బదిలీ చేస్తూ ఎస్పీ రోహిత్‌రాజు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను ఎస్పీ ఆఫీస్‌కి అటాచ్ చేశారు. 15 రోజుల క్రితమే భద్రాచలంలో ఉన్న మరో ఎస్‌ఐ పీవీఎన్ రావును కూడా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయగా, శనివారం అక్కడి నుంచి కరకగూడెం బదిలీ చేశారు. మూడు రోజుల క్రితం రూ. 20 వేలు లంచం తీసుకున్న కేసులో భద్రాచలం సీఐ రమేష్, గన్‌మెన్ రామారావుతో పాటు మరో ప్రైవేట్ వ్యక్తి ఏసీబీకి పట్టుబడ్డ విషయం విదితమే. ఏడాది కాలంలో భద్రాచలం ఠాణా పోలీసులు రెండు సార్లు ఏసీబీకి చిక్కారు. గత ఏడాది టౌన్ ఎస్‌ఐ, కానిస్టేబుల్ పట్టుబడగా, ఈసారి సీఐ, అతని గన్‌మెన్ పట్టుబడ్డారు. భద్రాచలం పోలీస్‌స్టేషన్‌ను ప్రక్షాళన చేసే క్రమంలోనే జిల్లా పోలీస్ అధికారులు ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. స్టేషన్‌లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన సిబ్బందిని కూడా బదిలీ చేయాలని పలువురు కోరుతున్నారు.

భద్రాచలంలో స్వప్న, శ్రవణ్ నియామకం

భద్రాచలం ఎస్‌ఐ–1గా స్వప్న, ఎస్‌ఐ–2గా శ్రవణ్ కుమార్‌లను నియమిస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో జార్ఖండ్‌లో జరిగిన నేషనల్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రం నుంచి ఆరుగురు పాల్గొనగా, వారిలో స్వప్న ఒకరు. కొంత కాలంగా కొత్తగూడెం వీఆర్‌లో ఉన్న ఆమెను భద్రాచలం బదిలీ చేశారు. ఇక ఎలక్షన్ సెల్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రవణ్‌ను ఎస్‌ఐ–2గా నియమించారు.

ఇల్లెందు సబ్ డివిజన్‌లో..

ఇల్లెందు: ఇల్లెందు సబ్ డివిజన్‌లోని పలువురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఇల్లెందు ఎస్‌ఐ పఠాన్ నాగుల్‌మీరా ఖాన్‌ను కొమరారం, కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్‌ను ఆళ్లపల్లికి బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీష్‌ను కొత్తగూడెం వీఆర్‌కు బదిలీ చేశారు. ఇల్లెందు మరో ఎస్‌ఐ డి. సందీప్, టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్‌లను కూడా బదిలీ చేశారు. కాగా పి.శ్రీనివాసరెడ్డి, ఎస్కే హసీనాలను ఇల్లెందు ఎస్‌ఐలుగా నియమించారు. కరకగూడెంలో పనిచేస్తున్న ఎస్‌ఐ రాజేందర్‌ను టేకులపల్లి బదిలీ చేశారు.

క్లుప్తంగా

నేడు రాత పరీక్షలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న కెమిస్ట్–1, ఈ గ్రేడ్–1, సెక్యూరిటీ జమేదార్ టీఎస్ గ్రేడ్–26 పోస్టులకు ఈ నెల 13న సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. కెమిస్ట్–1, ఈ గ్రేడ్–1 పోస్టుకు 13 మంది దరఖాస్తు చేసుకోగా, జమేదార్ పోస్టులకు 78 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి యాజమాన్యం హాల్ టికెట్లు పంపిణీ చేసింది. ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థులు సకాలంలో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

ఐఎన్‌టీయూసీ నేతకు వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: జేఏంఓల ప్రమోషన్ పాలసీలో మార్పులు చేయాలని కోరుతూ.. ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కృష్ణంరాజు శనివారం ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ–1 గ్రేడ్‌లో ఐదేళ్ల అనుభవం ఉంటేనే జేఎంఓ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అర్హత ఉందని, ఏ–1 గ్రేడ్‌కు రావడానికి ఉద్యోగులకు ఎక్కువ సమయం పడుతోందని తెలిపారు. ఉద్యోగ విరమణ దశలో అర్హత పొందుతున్నారని, ఫలితంగా గత నోటిఫికేషన్‌లో 87 పోస్టులకు గాను 15 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది ఎంపికయ్యారన్నారు. సమస్యను గుర్తించి త్వరితగతిన నోటిఫికేషన్ జారీ అయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్యయాదవ్, జయరాజు, దారా సుకుమార్ ఉన్నారు.

బెల్లం, పటిక పట్టివేత



పట్టుకున్న బెల్లంను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారి

కొత్తగూడెంఅర్బన్: నిషేధిత నాటుసారాయికి వినియోగించే బెల్లం, పటికను తరలిస్తుండగా శనివారం కొత్తగూడెం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ జయశ్రీ, ఎస్ఐ శ్రీహరిరావు కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని పెద్దబజార్‌లో బెల్లం ఉందనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీహరిరావు తన సిబ్బందితో దాడి చేసి, ట్రాలీలో ఉన్న 360 కేజీల బెల్లం, 15 కేజీల స్పటికం పట్టుకున్నారు. ట్రాలీని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించి, బెల్లం కొనుగోలు చేసిన రాంకుమార్, డ్రైవర్ మంగీలాల్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అయితే, ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నది పెద్ద వాహనమని, సమాచారం వెల్లడించే సమయంలో చిన్న వాహనం చూపించారనే ఆరోపణలు వచ్చాయి.

ఐదు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు షురూ..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో ఐదు రాష్ట్రాలస్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.


అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి అటవీ శాఖ చెక్‌పోస్టు మీదుగా ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలపను సిబ్బంది శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలు పరిశీలిస్తుండగా కలప పట్టుబడింది. ఈ మేరకు ట్రాక్టర్‌ను అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించగా, కలప విలువ రూ.లక్ష వరకు ఉండొచ్చని తెలిసింది.

గుండెపోటుతో యువకుడు మృతి

ఇల్లెందు: పట్టణంలోని బుగ్గవాగు ఏరియాకు చెందిన లోదు కార్తీక్‌సోనూ (24) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. అయితే, ఆయన అస్వస్థతకు గురికాగానే కుటుంబీకులు, స్నేహితులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉన్నందున కొత్తగూడెం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కానీ కుటుంబీకుల వినతితో వైద్యం చేస్తుండగానే కార్తీక్ మృతి చెందాడు. దీంతో బంధువులు, కుటుంబీకులు వైద్యుడిని నిలదీయగా ఉద్రిక్తత నెలకొంది. ఈ విషయం తెలిసి సీఐ మత్తుల సత్యనారాయణ చేరుకుని నచ్చజెప్పడంతో వెళ్లిపోయారు.

క్రికెట్ ఆడుతూ కుప్పకూలి...



విమల్ (ఫైల్)

ఇల్లెందు: బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్న ఇల్లెందు సబ్‌జైల్ బస్తీకి చెందిన ఆంటోనీ విమల్ (30) గుండెపోటుతో మృతి చెందారు. మరికొందరు ఉద్యోగులతో కలిసి ఆయన అక్కడ శనివారం క్రికెట్ ఆడుతూనే కుప్పకూలినట్లు తెలిసింది. ఈ విషయమై అందిన సమాచారంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

అగ్నిప్రమాదాలతో జాగ్రత్త

రేపటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

- జిల్లాలో ఐదు ఫైర్‌స్టేషన్లు
- ప్రమాదం జరిగితే డయల్–101కు సమాచారం ఇవ్వాలి



కొత్తగూడెంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయం

కొత్తగూడెంటౌన్: వేసవికాలం వస్తే అగ్ని ప్రమాదాలు జరగడం సర్వసాధారణం. గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు, గుడిసెల్లో పంటలు కోసిన తర్వాత వాటికి నిప్పు పెట్టే విషయంలో అజాగ్రత్తగా ఉంటే నిప్పు రవ్వలు ఎగసిపడి ఇతర ఇళ్లకు అంటుకుని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి మురహరి క్రాంతికుమార్ తెలిపారు. అగ్ని ప్రమాదాల నుంచి ఎలా బయట పడాలి, ఎలా రక్షించుకోవాలనే విషయాలను ప్రాక్టికల్‌గా డ్రిల్ చేసి అవగాహన కల్పిస్తారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట ఫైర్ స్టేషన్‌ల పరిధిలో 51 మంది సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం 28 మంది ఉన్నారు. మరో 23 మంది కొరత ఉంది. 1944లో ఏప్రిల్ 14న ముంబై విక్టోరియా డాక్ యార్డ్‌లోని నౌకలో అగ్ని ప్రమాదం సంభవించగా, విధి నిర్వహణలో ఉన్న 66 మంది అగ్నిమాపక సిబ్బంది మరణించారు. వారి జ్ఞాపకార్థం వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

మూడేళ్లలో జరిగిన ఘటనలు..

- 2022లో మొత్తం 351 అగ్ని ప్రమాదాలు సంభవించగా.. రూ.2,62,4000 నష్టం వాటిల్లింది. 62 ఘటనల్లో మనుషులు, పశువులను రక్షించారు.
- 2023లో మొత్తం 265 అగ్నిప్రమాదాలు జరగగా రూ.32,19,6000 నష్టం జరిగింది. రూ.15,31,64000 సొత్తును రక్షించారు. 77 ఘటనల్లో మనుషులు, పశువులను రక్షించారు.
- 2024లో మొత్తం 232 అగ్నిప్రమాదాలు సంభవించాయి. రూ.07,38,10,000 నష్టం వాటిల్లింది. 66 ఘటనల్లో మనుషులు, పశువులను రక్షించారు.
- 2025లో మార్చి వరకు మొత్తం124 అగ్నిప్రమాదాలు జరిగాయి. రూ.1,12,40,007 నష్టం జరిగింది. 66 ఘటనల్లో మనుషులు, పశువును రక్షించారు.

డయల్101కి సమాచారం ఇవ్వాలి



ఎండలు రోజురోజుకూ మండిపోతుండటంతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. మూడేళ్లలో 972 ప్రమాదాలు సంభవించగా దాదాపు రూ.13,88,70,007 ఆస్తులకు నష్టం వాటిల్లింది. జిల్లాలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నతాధికారులకు అధికారులకు నివేదిస్తాం. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణమే డయల్–101కు సమాచారం ఇవ్వాలి.

– మురహరి క్రాంతికుమార్, డీఎఫ్ఓ

ఈ సూత్రాలు పాటించాలి..

- అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, దుకాణ సముదాయాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.
- అపార్టుమెంట్లు, సినిమా హాళ్లు, షాపింగ్‌మాళ్లలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రతి ప్లాట్‌కు నీరు అందేలా పైపులైన్‌ను ఏర్పాటు చేయాలి.
- షాపుల్లో మండే స్వభావం ఉన్న వస్తువులను పెట్టకూడదు
- ఇంట్లో ఉండే సిలిండర్లకు వేడి తగలకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ఇళ్లల్లో, షాపుల్లో వెంటిలేషన్‌ను సరిగ్గా ఉండేలా చూడాలి.
- అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు విధిగా ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- గృహాలు, రైస్‌మిల్లులు, ఆఫీసులు, దుకాణాల్లో నాణ్యమైన కరెంట్ వైరింగ్ చేయించుకోవాలి.

రైస్ పుల్లింగ్ మిషన్ పేరుతో బురిడీ

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజేశ్

బూర్గంపాడు: రైస్ పుల్లింగ్ మిషన్ అమ్మకానికి ఉందని మోసాలకు పాల్పడుతున్న ముఠాను శనివారం బూర్గంపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజేశ్ కథనం ప్రకారం.. శనివారం సిబ్బందితో సారపాకలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా.. అదుపులోకి తీసుకుని విచారించడంతో రైస్ పుల్లింగ్ మిషన్ ఉందని నమ్మించి పలువురిని మోసగించామని ఒప్పుకున్నారు. ఈ ఏడాది జనవరిలో చర్ల మండలం బత్తినపల్లి గ్రామానికి చెందిన కొమరం రాజబాబు వద్ద రూ.లక్ష తీసుకున్నారు. అతను రైస్ పుల్లింగ్ మిషన్ అడుగగా మరో రూ.లక్ష కావాలని డిమాండ్ చేయగా.. జనవరి 25న రాజబాబు డబ్బుతో మండలంలోని క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చాడు. ఈ ముఠా రాజబాబును కొట్టి రూ.లక్ష తీసుకుని కారులో పరారైంది. వీరితో పాటు జంగారెడ్డిగూడెంనకు చెందిన నారాయణ ఉన్నారు. కాగా, భద్రాచలంలో కొందరిని కలిసి రైస్ పుల్లింగ్ మిషన్ అమ్మకానికి ఉందని నమ్మించి మోసగించేందుకు యత్నిస్తున్న ఈ ముఠా సారపాకలో పోలీసులకు పట్టుబడింది. ఈ ముఠాలో పాల్వంచలోని తెలంగాణనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ దొనకొండ సురేశ్‌బాబు, భద్రాచలం పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ షేక్ అబ్దుల్ రవూఫ్, చర్ల మండలం విజయకాలనీకి చెందిన టైలర్ ఉర్ల శ్రీనివాసరావు ఉన్నారు. జంగారెడ్డిగూడెంనకు చెందిన నారాయణ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి రూ.1.90 లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ వెల్లడించారు.

8 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రావ్ కథనం ప్రకారం.. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది మావోయిస్టులు పార్టీ సిద్ధాంతాలు నచ్చక, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా లొంగిపోయేందుకు వచ్చినట్లు చెప్పారు. లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి పునరావాసం కల్పిస్తామని ఆయన చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న దంతెవాడ ఎస్పీ

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

రూ.28.80 లక్షల గంజాయి, కారు స్వాధీనం



నిందితులు, గంజాయిని చూపుతున్న సీఐ రమేశ్

పాల్వంచ: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ సుంకరి రమేశ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర పుణె జిల్లా, థౌండ్ తాలూకా, పింపల్‌గాం గ్రామానికి చెందిన సాగర్ హరిదాస్ దోబ్లే, నీలేశ్, కిషోర్ ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ ధరకు గంజాయిని ఒడిశాలోని మల్కన్‌గిరిలో కొనుగోలు చేసి కారులో అమ్మారు. ఆంధ్ర, ఒడిశా బోర్డర్ నుంచి భద్రాచలం, పాల్వంచ మీదుగా పుణెకు తరలిస్తుండగా పాల్వంచ వద్ద ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేశ్, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకటేశ్, విజయ్‌కుమార్, ఉపేందర్ పట్టుకున్నారు. కారులో ఉన్న 51.27 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.28.80 లక్షలు, అన్ని వస్తువులు కలిపి రూ.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను సీఐ ప్రసాద్‌కు అప్పగించారు.

పాత ఇనుప దుకాణంలో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న పాత కార్లు

పాల్వంచ: పాత ఇనుమ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని తెలంగాణనగర్ వద్ద గల బీఎల్ నాయుడుకు చెందిన పాత ఇనుప దుకాణం యార్డ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి సిగరేట్ తాగి పడేయడంతో చెత్తకు అంటుకుని మంటలు చెలరేగాయి. స్క్రాప్‌నకు వచ్చిన సుమారు పది కార్లకు నిప్పంటుకుని భారీగా మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ ఆఫీసర్ పుల్లయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఆయూబ్, ఉదయ్, ప్రతాప్, వెంకటేశ్వర్లు మంటలను ఆర్పివేశారు.

కారు ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి మృతి

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనంపై రిటైర్డ్ ఉద్యోగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన, భద్రాచలం ఐటీడీఏ ఈఈ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన కటుకూరి నాగభూషణం (63) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎదురుగా భద్రాచలంవైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగభూషణాన్ని ఖమ్మం తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ కోయిల విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. మృతుడికి భార్య పవిత్ర, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెంలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఇర్ప కృష్ణ (40) మృతిచెందాడు. ఎల్లాపురం గ్రామంలో శుభకార్యానికి హాజరైన కృష్ణ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కొమరారం పోలీసులు కృష్ణను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మధ్యలోనే కృష్ణ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్ఐ సోమేశ్వర్ తెలిపారు.

సివిల్ లైన్‌లో చోరీ..

ఇల్లెందు: పట్టణంలోని సివిల్‌లైన్‌లో పెద్దపల్లి కుమారస్వామికి చెందిన ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంధువుల ఇంట్లో పెళ్లికి హాజరయ్యేందుకు కుమారస్వామి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉండటంతో పరిశీలించారు. 18 తులాల బంగారం, రెండు జతల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న సీఐ అశోక్

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన దున్న రాజు (50) భార్య మృతి చెందిందనే మనస్తాపంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. సీఐ అశోక్ కథనం ప్రకారం.. రాజు గోదావరిలో చేపలు పట్టుకుంటూ జీవిస్తున్నాడు. సుమారుగా ఆరు నెలల కిందట రాజు భార్య ఖాదరమ్మ క్యాన్సర్‌తో చనిపోయింది. అప్పటి నుంచి రాజు మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి శివారులోని గోదావరికి చేపలు పట్టేందుకు వెళ్లి ఒడ్డున ఉన్న చెట్టు కొమ్మకు ఉరి వేసుకుని మృతిచెందాడు. తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లిన గ్రామస్తులు గమనించిన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా.. అందరికీ వివాహాలయ్యాయి.


మనస్తాపంతో ఒకరు..

గుండాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆళ్లపల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన నల్లమాసు ఉప్పలయ్య (45) కొంతకాలంగా కంటిచూపు సరిగ్గా లేక, బీపీతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తొలుత ఆళ్లపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వాహనాల తనిఖీ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం అర్ధరాత్రి నార్కోటిక్ బ్యూరో పోలీసులు విశ్వసనీయ సమాచారంతో ఓ లారీని ఆపి తనిఖీ చేయగా, భారీ స్థాయిలో గంజాయి లభ్యమైంది. కాగా ప్రస్తుతం భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌ను లంచం తీసుకున్న కేసులో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి భద్రాచలం పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్ఓ స్థాయి అధికారి అందుబాటులో లేకపోవడంతో ఈ కేసును నార్కోటిక్ బ్యూరో పోలీసులు మరో స్టేషన్‌కు బదలాయించారు. కాగా పట్టుబడిన గంజాయి దాదాపు 7 క్వింటాళ్ల వరకు ఉన్నట్లు సమాచారం.

భద్రాచలంలో భక్తురాలిపైకి దూసుకెళ్లిన కారు



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

భద్రాచలంఅర్బన్: రోడ్డు పక్కన నిద్రిస్తున్న ఓ మహిళ మీదకు కారు దూసుకురావడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున 3 గంటలకు చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. శనివారం ఉదయం 3 గంటలకు కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన 8 మంది భక్తులు రామయ్య దర్శనానికి వచ్చి, రోడ్డు పక్కనే నిద్రపోయారు. హైదరాబాద్ నుంచి రామయ్య దర్శనానికి వచ్చిన ప్రశాంత్ తన కారును రివర్స్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడే నిద్రపోతున్న అమరుగుండ లక్ష్మమ్మ పైకి పోనిచ్చాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను స్థానికుల సహాయంతో ప్రశాంత్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం లక్ష్మమ్మను సొంత గ్రామానికి తరలించాలని ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించి, ప్రైవేట్ అంబులెన్స్‌లో తరలించారు. కాగా, ప్రస్తుతానికి లక్ష్మమ్మ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

బతుకుబండి సాగుతోంది..

పాత బైక్‌తో ఐస్ క్రీమ్ వ్యాపారం



ఐస్ క్రీమ్ బండిపై యువకుడు

కరకగూడెం: కష్టపడి పనిచేయాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమేనని నిరూపిస్తున్నాడు ఓ యువకుడు. సృజనాత్మకతతో పాత ద్విచక్రవాహనం ముందు భాగంలో ఉండే చక్రాన్ని తొలగించి దాని స్థానంలో రెండు చక్రాల ఐస్ క్రీమ్ బండిని అమర్చుకొని ఊరూరు తిరుగుతూ ఉపాధి పొందుతున్నాడు. రంగురంగుల కాగితాలు, బొమ్మలతో బండిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాడు. తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించి రోజుకు మంచి ఆదాయం పొందుతున్నాడు. ఈ యువకుడి కృషిని అందరూ అభినందిస్తున్నారు.

ఆడపిల్లలు పుట్టారని అక్రమంగా దత్తత?

ఆలస్యంగా బయటపడడంతో అధికారుల విచారణ



మల్లేష్ ఇంటి వద్ద విచారణ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చింతకాని: మొదటి, రెండు కాన్పుల్లో ఆడపిల్లలు.. మూడో కాన్పులోనూ ఆడపిల్ల అని తెలియగా అబార్షన్ చేయించడమే కాక.. నాలుగో కాన్పులో కవల ఆడ శిశువుల జన్మించడంతో శిశువులను బంధువులకు దత్తత ఇచ్చిన ఘటన ఆలస్యంగా బయటపడింది. ఈ విషయం తెలిసి ఐసీడీఎస్ అధికారులు శిశువుల ఆచూకీపై ఆరా తీస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. చింతకాని మండలం నాగులవంచ రైల్వేకాలనీకి చెందిన నల్లగాజు మల్లేష్ – ఉమ దంపతులకు ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడో కాన్పులోనూ గర్భంలో ఆడపిల్ల పెరుగుతోందని తెలియగా ఉమ అబార్షన్ చేయించుకుంది. ఆ తర్వాత మళ్లీ గర్భం దాల్చగా గత నెల 31న ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కవల ఆడ శిశువులకు జన్మనిచ్చింది. దీంతో కవల శిశువులను ఆస్పత్రిలోనే ఉమ తన అక్కకు దత్తత ఇచ్చేసి ఇంటికి వచ్చారు. మూడు రోజుల క్రితం ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు కలిసి ఉమ, శిశువు ఆరోగ్య వివరాలు తెలుసుకునేందుకు ఆమె ఇంటికి వెళ్లగా శిశువులు కానరాలేదు. ఏమైందని ఆరా తీయగా పోషించలేకనే బంధువులకు దత్తత ఇచ్చామని బదులిచ్చారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, ఏసీడీపీఓ శివకుమారి, సూపర్‌వైజర్ పద్మావతి కలిసి మల్లేష్ ఇంటికి వెళ్లగా ఆయన 'మా పిల్లలు మా ఇష్టం.. ఏమైనా చేసుకుంటాం.. అడగానికి మీరెవరు' అంటూ దురుసుగా సమాధానం చెప్పారు. చట్టానికి లోబడి దత్తత ఇవ్వాలని, అలాకాకుండా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఉంటున్న ఉమ అక్కకు పిల్లలను దత్తత ఇచ్చామని, సోమవారం వరకు తీసుకొస్తామని, లేనిపక్షంలో ఏ చర్యలైనా తీసుకోవచ్చని లేఖ రాసి ఇచ్చారు. కాగా, ఐసీడీఎస్ అధికారులకు వీడియో కాల్ ద్వారా కవల ఆడ శిశువులను చూపించారు.

పురాతన భవనం కూల్చివేత



దుమ్ముగూడెంలో కోట్ల వారి భవనం (ఫైల్)



భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలో 155 ఏళ్ల కిందట కట్టిన అద్భుత కట్టడం కనుమరుగైంది. 155 ఏళ్ల కిందట కట్టిన భవనం ఆ కాలంలో నిత్యం వందల మందికి ఆశ్రయమిచ్చినట్లు చెబుతున్నారు. వ్యాపారం నిమిత్తం వచ్చిన కోట్ల సన్యాసయ్యనాయుడు విదేశాల నుంచి తీసుకొచ్చిన సామగ్రితో ఈ ఇంటి నిర్మాణం చేపట్టారు. అది పాత బడటం.. పెచ్చులు ఊడిపోతుండటంతో అధికారులు కూల్చివేయాలని కుటుంబ సభ్యులకుసూచించారు. దీంతో సన్యాసయ్య కుటుంబీకులు నాలుగు రోజులుగా కూల్చివేస్తున్నారు.